ఇసుక రవాణాతో ధ్వంసమవుతున్న గ్రామీణ రోడ్లు



భీమవరం రైల్వేట్రాక్ సమీపంలో తారులేచిపోయి అధ్వానంగా ఉన్న రోడ్డు



ఇసుకలారీల దెబ్బకు కుంగిన లింగాల తారురోడ్డు



లింగాల మూలమలుపు వద్ద దెబ్బతిన్న రోడ్డు



రైల్వేట్రాక్ సమీపంలో కుంగిన రహదారి

వత్సవాయి: ఇసుక రవాణా వాహనాల తాకిడికి వత్సవాయి మండలంలోని పలురోడ్లు ధ్వంసమయ్యాయి. లింగాల–ఆళ్లూరుపాడు ఆర్అండ్‌బీ రోడ్డుతోపాటు మక్కపేట–భీమవరం, మక్కపేట–పెనుగంచిప్రోలు రహదారి, గోపినేనిపాలెం రహదారులు కూడా దెబ్బతిన్నాయి. ఇసుక రవాణా చేసే లారీలు, ట్రాక్టర్లు పరిమితికి మించి ఓవర్‌లోడ్‌తో వెళ్తుండటంతో ఆయా రోడ్లు ధ్వంసమవుతున్నాయని మండల ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల లింగాల–ఆళ్లూరుపాడు రోడ్డుకు మరమ్మతులు చేపట్టి, కంభంపాడు వరకు రహదారిని నిర్మాణం చేశారు. గతంలో ఈ రహదారిపై ప్రయాణమంటేనే వాహనదారులు బెంబేలెత్తేవారు. రోడ్డంతా గోతులమయంగా ఉండడంతో ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకునేవి. ఎట్టకేలకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టినప్పటికీ ఆళ్లూరుపాడు ఇసుక రీచ్ నుంచి ఇసుకను తరలించే లారీలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండటంతో పలుచోట్ల రోడ్డు కుంగిపోయింది. నిబంధనలకు విరుద్ధంగా సుమారు నలభై టన్నుల ఇసుకతో లారీలు వెళ్తుండటంతో రోడ్డు దెబ్బతింటూ గుంతలమయమవుతోంది. లింగాల గ్రామశివారు మూలమలుపు వద్ద రహదారి ధ్వంసం కాగా రైల్వే ట్రాక్ సమీపంలో కూడా రోడ్డు కుంగిపోయింది. రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. రాత్రి సమయాలలో రహదారి మధ్యలో ఏర్పడిన గుంతలు కనపడక ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా ప్రతినిత్యం ఇసుక ట్రాక్టర్లు, లారీలు గ్రామంలో నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదవార్త వినాల్సి వస్తుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఓవర్‌లోడింగ్‌తో ప్రయాణిస్తున్న ఇసుక లారీలపై చర్యలు తీసుకోవడంతోపాటు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేకుండా వెంచర్లు వేస్తే చర్యలు : ఆర్డీఓ

నందిగామటౌన్: వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేసుకోవాలనేవారు రెవెన్యూశాఖ నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఆర్డీఓ బాలకృష్ణ సూచించారు. మండలంలోని పొన్నవరం గ్రామ శివారులోని వ్యవసాయ భూమిని ల్యాండ్ కన్వర్షన్ చేయాలని దరఖాస్తు చేసుకోవడంతో శనివారం ఆయన ఆ భూమిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి వెంచర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాట్లుగా మార్చాలనుకునేవారు విధిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ హుస్సేన్, ఆర్ఐ సంధ్య, వీఆర్వోలు ఉన్నారు.

బందెలదొడ్డి ఆక్రమణపై ఫిర్యాదు

జగ్గయ్యపేటఅర్బన్: రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్‌కు అడుగడుగున అవరోధాలు కలిగిస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమైన రోడ్డుపై సంచరించే ఆవులు, పశువుల కోసం ఏర్పాటు చేసిన బందెలదొడ్డిని ఆక్రమణల నుంచి కాపాడాలని పట్టణానికి చెందిన సామాజికవేత్త కర్లపాటి శ్రీనివాసరావు శనివారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీకి గణనీయమైన ఆదాయాన్ని ఇవ్వడంతోపాటు రోడ్డుపై సంచరించే పశువులను కట్టడి చేయడానికి సౌకర్యవంతంగా ఉన్న బందెలదొడ్డిని కొందరు ఆక్రమించుకుంటున్నారన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

పాఠశాలలకు శానిటేషన్ సామగ్రి



చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల వనరుల కేంద్రంలో శనివారం ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి మంజూరైన శానిటేషన్ సామగ్రి పంపిణీ చేశారు. ఎంఈవో–2 చిట్టిబాబు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు శానిటేషన్ సామగ్రి అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేసే సిబ్బందికి కూడా మూడు నెలల నగదు అందించినట్లు వివరించారు. సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

దీక్షాపరులకు అన్నసమారాధన



కంచికచర్ల: అయ్యప్ప మాలాధారులకు సద్ది ఏర్పాటు చేయడం ఆ పరమేశ్వరుడి ఆశీస్సులు మెండుగా ఉంటాయని తాంత్రిక శ్రేష్ఠ కేరళ గురుస్వామి నంబూద్రి పప్పాస్వామి అన్నారు. కంచికచర్ల శ్రీశివసాయి క్షేత్రంలో కొలువై ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో కోరమండల్ యాజమాన్యం శనివారం అయ్యప్ప మాలాధారులకు అన్న సమారాధన చేసింది. గురుస్వామి మాట్లాడుతూ కోరమండల్ యాజమాన్యం దీక్షాస్వాములకు ఈ సద్ది కార్యక్రమాన్ని జనవరి 2వ తేదీ వరకు కొనసాగిస్తుందని వివరించారు.

మిరపలో సస్యరక్షణ చర్యలు పాటించాలి



వత్సవాయి: మిరప పంటను సాగుచేస్తున్న రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని ఉద్యానవనశాఖాధికారిణి టి.వర్ధినీకుమారి తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో సాగవుతున్న మిర్చి పంటను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాయతొలుసు పురుగు, లద్దెపురుగు, శనగపచ్చ పురుగు, రబ్బరు పురుగుల నివారణ కోసం క్లోరోపైరిపాస్, క్వినాల్‌పాస్, కార్బరిల్ మందులను పిచికారి చేసుకోవాలన్నారు. ఎండుతెగులు లేకుండా ట్రైకోడర్మా చల్లుకోవడంతో పాటు ట్రైకోడర్మా విరిడి పశువుల ఎరువుతో పాటు వేపపిండిని కలిపి చల్లుకుంటే నివారణ ఉంటుందని వివరించారు. కిందముడత నివారణ కోసం డైకోఫాల్ పిచికారీ చేయడం తోపాటు గంధకాన్ని చల్లుకుంటే మంచిదని తెలిపారు. ప్రస్తుతం పంట మంచిపూత, పిందె దశలో ఉన్నందును రైతులు జాగ్రత్తగా వ్యవహరించి పంటను చీడపీడల నుంచి రక్షించుకోవాలని సూచించారు.

శనిత్రయోదశి పూజలు



నందిగామటౌన్: శని త్రయోదశి సందర్భంగా నందిగామ పట్టణం, మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న శైవాలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి, భాస్కరానంద ఆశ్రమంతో పాటు మండలంలోని దాములూరు కూడలి సంగమేశ్వరస్వామి, గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి, రాఘవాపురం రామలింగేశ్వర స్వామి వారి ఆలయాల్లో శనీశ్వరుడు, నవగ్రహాలకు అర్చనలు, తైలాభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈవోలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు శనివారం పెనుగంచిప్రోలు మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్‌బాబు ఆర్థికసహకారంతో భౌతికశాస్త్రం మెటీరియల్‌ను పంపిణీచేశారు. మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులు సూచించారు.

స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



క్రీడాజ్యోతిని వెలిగించి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి

జగ్గయ్యపేటఅర్బన్: స్థానిక విజ్ఞాన్ విద్యాసంస్థల్లో శనివారం స్పోర్ట్స్ మీట్ ప్రారంభించారు. స్కూల్ డైరెక్టర్ తన్నీరు సుధారాణి క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఎన్‌సీసీ విద్యార్థులు క్రీడాజ్యోతిని ర్యాలీగా ప్రధాన వీధుల్లో తిప్పి క్రీడా ప్రాంగణానికి చేర్చారు. సుధారాణి మాట్లాడుతూ నేటి పోటీప్రపంచంలో సక్సెస్ కావాలంటే విద్యతో పాటు ఎన్‌సీసీ, క్రీడల్లోనూ రాణించాలన్నారు. గెలిచినవారు గర్వించకుండా, ఓడినవారు కుంగిపోకుండా అందరూ క్రీడాస్ఫూర్తితో ఆడాలని కోరారు. ఈ ఆటల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, టెన్నీకాయిట్, రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, స్కిప్పింగ్ తదితర 10రకాల క్రీడలను బాలబాలికలకు విడివిగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ మెహబూబ్‌బాషా, ఎన్‌సీసీ ఆఫీసర్ పి.శ్రీనివాసరెడ్డి, పీఈటీ ప్రశాంత్, ఉపాధ్యాయులు పద్మజన్, నజీర్, సీతారామయ్య, రాము, దాసు, విజయ్, రమేష్, లాలి, శివకన్య, కృష్ణవేణి, భవాని, వినయవాణి, నాగమణి, ఖాదర్‌బీ, గీత, సుమలత పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టడంపై శిక్షణ



మాట్లాడుతున్న ఎంపీడీవో నితిన్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎంపీడీవో నితిన్ పేర్కొన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోరి వికాసం కార్యక్రమంపై మండలస్థాయిలో ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలపై అవగాహన ఉండటం లేదన్నారు. వీటి నియంత్రణకు గ్రామాల్లోని ఐసీడీఎస్, సచివాలయ, వైద్యారోగ్య తదితరశాఖల అధికారులు, సిబ్బంది అవగాహన కలిగించాల్సి ఉందన్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో కౌమారదశలో ఉన్న బాలబాలికలకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. కిశోరి వికాసంలో భాగంగా లింగ వివక్షత, సంపూర్ణ ఆహార ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత రుతుస్రావ పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, బాల్య వివాహాలను అరికట్టడం, మానవ అక్రమ రవాణా, ఆత్మరక్షణ, నైపుణ్యం, ఉపాధి వంటి తొమ్మిది అంశాలపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. శిక్షణ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి, ఏసీడీపీవో నాగమణి, ఆయుష్ వైద్యురాలు శోభ, ఏపీఎం వెంకటేశ్వరరావు, ఎంఈవో చిట్టిబాబు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఘంటా వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ప్రధానోపాధ్యాయులు, మహిళా పోలీస్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామటౌన్: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ సీడీపీవో భాగ్యరేణుక పేర్కొన్నారు. పట్టణంలోని బాబూజగ్జీవన్‌రాం భవన్‌లో శనివారం కిశోరి వికాసంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడంతోపాటు కిశోర బాలలకు యోగా, ధ్యానం, పరిపూర్ణ ఆరోగ్యం తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకట్రావమ్మ, కరుణ, తారాభి తదితరులు పాల్గొన్నారు.

సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన



పేరకలపాడులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్‌శాఖ లైన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు



సోలార్ రూఫ్‌టాప్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో నితిన్

కంచికచర్ల : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ లైన్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పేరకలపాడులో సోలార్ విద్యుత్ వినియోగం, పీఎం సూర్యఘర్ పథకాలపై గ్రామస్తులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకునేవారందరికీ ప్రభుత్వం రాయితీ అందిస్తోందన్నారు.సౌరశక్తి నుంచి విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు కేంద్రప్రభుత్వం ఓ కోటి ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇది పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యుత్ ఖర్చును తగ్గిస్తుందన్నారు. రూఫ్‌టాప్‌పై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను వినియోగించుకోవడంతోపాటు మిగిలిన విద్యుత్‌ను పవర్‌గ్రిడ్‌లకు విక్రయించుకోవచ్చన్నారు. అదనపు విద్యుత్ విక్రయం ద్వారా ఏడాదికి రూ.17వేల నుంచి రూ.18 వేల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. నెలకు 0–150 యూనిట్ల విద్యుత్ వినియోగించే వారికి 1 నుంచి 2 కిలోవాట్ల రూఫ్‌టాప్ వ్యవస్థ ఏర్పాటు చేసుకుంటే సరిపోతుందన్నారు. ఈ పథకాన్ని ప్రతిఒక్కరూ ఉపయోగించుకుని లబ్ధిపొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచి సాత్విక, లైన్‌మెన్ సత్యనారాయణ, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై సమీక్ష

చిల్లకల్లు(జగ్గయ్యపేట): సచివాలయ కార్యదర్శులు ప్రధానమంత్రి సూర్యఘర్ ముక్త్ బిజిలీ యోజన పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో నితిన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోలార్ రూఫ్‌టాప్‌పై సచివాలయ కార్యదర్శులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు సోలార్ రూఫ్‌టాప్‌పై రాయితీ ఇస్తుందన్నారు. గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందని వివరించారు. విద్యుత్ బిల్లులు తక్కువగా వస్తాయని, అవసరమైన మేరకు వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించుకోవచ్చని తెలిపారు. ఈపథకంపై ప్రజలకు అవగాహన పెరిగేలా సిబ్బందికి కృషిచేయాలని సూచించారు. అనంతరం ఈ పథకంపై రూపొందించిన కరపత్రం ఆవిష్కరించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన


ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో నందికొట్కూరుకు చెందిన లిక్షిత శ్రీ నృత్య కళాశాలకు చెందిన పలువురు కళాకారులు శనివారం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. సాయి లిక్షితశ్రీ పలుకీర్తనలకు అనుగుణంగా నృత్యం చేశారు. నృత్య ప్రదర్శనను భక్తులు ఎంతో ఆసక్తిగా వీక్షించారు.

పేట పోలీస్‌స్టేషన్ తనిఖీ



జగ్గయ్యపేటఅర్బన్: వార్షిక తనిఖీలో భాగంగా నందిగామ సబ్ డివిజన్ ఏసీపీ ఏబీజీ తిలక్ శనివారం జగ్గయ్యపేట సర్కిల్ కార్యాలయం, పట్టణ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఏసీపీ తిలక్ విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించినట్లు చెప్పారు. నేరాలను అరికట్టేందుకు 'డ్రోన్ పెట్రోలింగ్' అనే వినూత్న ప్రణాళికను పోలీసు కమిషనర్ రూపొందించినట్లు చెప్పారు. ఈ విధానం ద్వారా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, ఈవ్ టీజింగ్, ఓపెన్ రిగ్గింగ్, వీఐపీ సెక్యూరిటీ, ధర్నాలను పర్యవేక్షించనున్నట్లు చెప్పారు. ఈ విధానాన్ని పేట సర్కిల్‌పరిధిలోని పోలీసుస్టేషన్లలో ప్రారంభిస్తున్నామన్నారు. రాష్ట్ర సరిహద్దుగా ఉన్న జగ్గయ్యపేట ప్రాంతంలో నేరగాళ్లను పట్టుకునేందుకు క్రైం పార్టీ, హైవే పెట్రోలింగ్ ద్వారా నిరంతరం నిఘా ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులకు ఇన్సూరెన్స్ క్లెయిమ్ అయ్యేలా చూడటం, ఉచిత ఇసుకను ఏపీలోనే వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవడం, అక్రమ రవాణాను అడ్డుకోవడంతోపాటు గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నామని వివరించారు. హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్రవాహనదారులంతా తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించామని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. సంక్రాంతికి కోడి పందేలు జరగకుండా చూస్తామన్నారు. కోడిపందేలు వేసేందుకు యత్నించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ పి.వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రాజు, వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు



కంచికచర్ల: ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్యనందించడంతోపాటు క్రీడారంగంలో నాణ్యమైన మంచి తర్ఫీదు ఇస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.వంశీకిరణ్ తెలిపారు. కేతనకొండ ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సెంట్రల్‌జోన్ ఖోఖో పోటీలో పాల్గొని ద్వితీయస్థానం దక్కించుకున్న మిక్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులను శనివారం కళాశాలలో అభినందించారు. ఆయన మాట్లాడుతూ సెంట్రల్ జోన్ ఖోఖో పోటీల్లో తమ విద్యార్థులు ద్వితీయ బహుమతిని సాధించారని వివరించారు. జట్టులోని విద్యార్థులు డీవీ కృష్ణ, బి.పవన్‌కుమార్ మంచి ప్రతిభ కనబరిచి త్వరలో చైన్నైలో జరిగే దక్షిణ భారత విశ్వవిద్యాలయలో నిర్వహించే పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నిమ్మగడ్డ శౌరయ్య తెలిపారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటు ఏర్పాటుకు వినతి



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, పక్కన పట్టాభిరాం, ఎంపీ శివనాథ్

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జగ్గయ్యపేట పట్టణాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్‌లకు పేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) కృతజ్ఞతలు తెలియజేశారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ ఎం.రామ్మోహనరావు, కౌన్సిలర్లుతో కలిసి విజయవాడలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. జగ్గయ్యపేట పట్టణంలో ప్రస్తుతం రోజుకు 18టన్నుల తడిపొడి చెత్తను సేకరిస్తున్నారని, ఈ చెత్తనంతా వాహనాల ద్వారా సేకరించి ఊరి బయట విలియంపేట ఆవతల డంప్ చేస్తుండటంతో ఆయా ప్రాంతాల ప్రజలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారన్నారు. సమస్యను పరిష్కరించేందుకు జగ్గయ్యపేటలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని వారిని కోరినట్లు తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు సంగెపు బుజ్జిబాబు, గొట్టె నాగరాజు, గింజుపల్లి వెంకట్రావు, ఇర్రి నరసింహారావు, నాయకులు కొఠారు సత్యనారాయణప్రసాద్, మేకా వెంకటేశ్వర్లు, మైనేని రాధా, రావూరి శ్రీను, ఏలూరి గోపాలరావు, వేదులాపురి సైదా, కర్ల జోజి హాజరైనట్లు మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తెలిపారు.

రెవెన్యూ సదస్సుకు 33 అర్జీలు



మున్నలూరు రైతుల సమస్యలు వింటున్న కంచికచర్ల తహసీల్దార్ జాహ్నవి

మున్నలూరు(కంచికచర్ల): గ్రామాల్లో భూవివాదాలకు తావులేకుండా పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ పి.జాహ్నవి పేర్కొన్నారు. మండలంలోని మున్నలూరు గ్రామసచివాలయంలో శనివారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల సర్వేనంబర్లలో కొలతలు, హద్దులను సరిచేయాలని కోరుతూ ఐదుగురు రైతులు అర్జీలు అందజేసినట్లు వివరించారు. వచ్చిన అర్జీలను త్వరతిగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మానస, ఆర్ఐ వెంకట్, వీఆర్వో ప్రదక్షిణరావు, రైతులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

గౌరవరం(జగ్గయ్యపేట): గ్రామంలోని సచివాలయం వద్ద శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ పరమైన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఆయా భూసమస్యల పరిష్కారం కోరుతూ 18అర్జీలు అందినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, సర్వేయర్ అనూష్‌బాబు, ఆర్ఐ సూరమ్మ, వీఆర్వో వెంకటరత్నం, కార్యదర్శి సంక్రాంత్, నాయకులు కట్టా నరసింహారావు, పావని వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: రెవెన్యూ సదస్సుల్లో వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ హుస్సేన్ తెలిపారు. మండలంలోని కొణతాలపల్లిలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పది అర్జీలు అందినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతీదేవి, సర్పంచ్ నంద్రు సౌజన్య, ఎంపీటీసీ సభ్యుడు ఐలూరి వెంకట్రావమ్మ, ఉపసర్పంచ్ ఐలూరి నర్సిరెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కేతవీరునిపాడులో..

నందిగామ టౌన్: రైతులు రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సురేష్‌బాబు సూచించారు. మండలంలోని కేతవీరునిపాడులో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు రైతులకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. అనంతరం ఆయా సమస్యలు పరిష్కరించుకోవాలని కోరుతూ రైతులు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేటలో కొండనాగు హల్‌చల్



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని తొర్రగుంటపాలెంలో ఆర్డీవో కార్యాలయం వెనుక ప్రాంతంలోని మండిపూడి శ్రీనివాసరావు అనేవ్యక్తి ఇంటి ఆవరణలో ఉన్న విద్యుత్ మోటారులో శనివారం ఓ కొండ నాగుపాము చుట్టుకొని ఉండటంతో చూసిన పరిసర ప్రాంతాల ప్రజలు భయంతో పరుగులు తీశారు. ఇంటి యజమాని విషయాన్ని వెంటనే స్థానికంగా ఉన్న స్నేక్ క్యాచర్ సుధాకర్‌కు తెలియజేయడంతో ఆయన హుటాహుటిన వచ్చిన కొండ నాగుపామును చాకచక్యంగా పట్టుకున్నారు. జనసంచారం లేని అడవి ప్రాంతానికి తీసుకెళ్లి వదిలేశారు. పాముల కారణంగా సమస్య ఏర్పడితే వెంటనే తన సెల్ నంబరు 8790443097కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

మూడు వార్డులకు ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా



నందిగామటౌన్: పట్టణంలోని ముక్కపాటి కాలనీ, రైతుపేట ప్రాంతాల్లోని ఎనిమిది, తొమ్మిది, 10వ వార్డులకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణబాబు తెలిపారు. తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ముక్కపాటికాలనీలో ఉన్న ఈఎల్ఎస్ఆర్ (ఓవర్ హెడ్ ట్యాంకు) శిథిలావస్థకు చేరడంతో ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా తాగునీటి సరఫరాను నిలుపుదల చేసినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయంగా కీసర మెయిన్ నుంచి తాగునీటిని సరఫరా చేసేందుకు పైప్‌లైన్ నుంచి ఇంటర్ కనెక్షన్ పనులు సాగుతున్నాయన్నారు. ఈ పనులు పూర్తయ్యేందుకు ఐదారురోజులపాటు సమయం పట్టే అవకాశం ఉండటంతో అప్పటివరకు తాగునీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. ప్రజలకు ఇబ్బందిలేకుండా ప్రత్యామ్నాయంగా ఆయా వార్డుల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని కమిషనర్ వివరించారు. ఐదు నుండి ఆరు రోజుల పాటు తాగునీటి సరఫరా అంతరాయం కలుగుతుందని ట్యాంకర్‌ల ద్వారా తాగునీటి సరఫరా జరుగుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.